## చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

• సీనియర్ సివిల్ జడ్జి నాగేశ్వర్‌రావు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి నాగేశ్వర్‌రావు

మెట్‌పల్లి, నవంబర్ 9: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని మెట్‌పల్లి సబ్‌కోర్టు సీనియర్ సివిల్ జడ్జి నాగేశ్వర్‌రావు సూచించారు. న్యాయసేవల దినోత్సవం సందర్భంగా శనివారం మెట్‌పల్లి పట్టణ శివారులోని మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు హాజరై, మాట్లాడారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, క్రమ శిక్షణతో మెలగాలని సూచించారు. జూనియర్ సివిల్ జడ్జి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఉన్నత విద్యను అభ్యసించి సమాజంలో ఆదర్శపౌరులుగా ఎదగాలన్నారు. ఇక్కడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు పుప్పాల లింబాద్రి, ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్, ప్రిన్సిపాల్ తిరుపతి, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ ఉన్నారు.

## ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి : సీపీ శ్రీనివాస్

ముత్తారం, నవంబర్ 9: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించి పరిష్కారం చూపిస్తే ప్రజలకు పోలీస్‌శాఖపై మరింత నమ్మకం కలుగుతుందని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం ఆయన ముత్తారం పోలీస్‌స్టేషన్ సందర్శించారు. ముందుగా స్టేషన్ పరిసరాలు, ఫిటిషన్లు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరతగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. డయల్ 100కి వచ్చే కాల్స్‌పై సత్వరమే స్పందించి, వెంటనే ఘటనా స్థలానికి చేరుకోవాలని బ్లూకోల్ట్స్ సిబ్బందికి సూచించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించి ప్రజల సమస్యలు, ఫిర్యాదులు తెలుసుకోవాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాల సరఫరా, రవాణాపై నిరంతర నిఘా ఉంచాలన్నారు. ఇక్కడ మంథని సీఐ రాజు, ముత్తారం ఎస్ఐ గోపతి నరేశ్, రామగిరి ఎస్ఐ చంద్రకుమార్, సిబ్బంది ఉన్నారు.



గోదావరికి హారతినిస్తున్న భక్తులు

## వైభవంగా గోదావరికి హారతి

ధర్మపురి, నవంబర్ 9: కార్తీక మాసం సందర్భంగా ఎనిమిదో రోజు శనివారం ధర్మపురిలో గోదావరి మాతకు హారతి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అంతకుముందు పండితులు, అర్చకులు, భక్తులు నృసింహుడి దేవస్థానం నుంచి మేళతాళాల మధ్య గోదావరి వద్దకు శోభాయాత్రగా వచ్చారు. గోదారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలు, భక్తులతో కలిసి నదికి హారతినిచ్చారు. నదిలో కార్తీక దీపాలను వదిలారు. కార్యక్రమంలో వేదపండితులు బొజ్జ రమేశ్‌శర్మ, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు నంబి శ్రీనివాసాచార్యులు, శారదామహిళ మండలి సభ్యులు, వాసవీ మహిళ మండలి సభ్యులు ఉన్నారు.

## సూరమ్మ ప్రాజెక్టు పనుల పరిశీలన

కథలాపూర్, నవంబర్ 9: కలికోట శివారులోని సూరమ్మ ప్రాజెక్టు పనులను నీటిపారుదలశాఖ ఈఈ సంతు ప్రకాశ్‌రావు పరిశీలించారు. త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. తూములు ఎక్కడ నిర్మించాలనే విషయమై చర్చించారు. ఇక్కడ డీఈ విష్ణు, నాయకులు నర్సింహారెడ్డి, రాఘవరెడ్డి ఉన్నారు.























